ఓటరు జాబితాలో పేర్లు తొలగింపుపై విచారణ

- నాడు–నేడు అభివృద్ధి పనుల దృష్ట్యా పోలింగ్ బూత్‌లలో మార్పులు
- 'వేమూరు' ఎన్నికల అధికారి జె.మోహనరావు


రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల అధికారి మోహనరావు

వేమూరు: బీఎల్వోలు చేపట్టిన ఓటరు జాబితాలో పేర్లు తొలగింపుపై విచారణ చేయనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి జె.మోహనరావు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్వోలు ఒకరి పేరు తొలగించాల్సింది పోయి మరొకరి పేరు తొలగించినట్లు తెలిపారు. వేమూరు నియోజక వర్గంలో 52 పేర్లు తొలగించారని, దీనిపై విచారించేందు అధికారులను కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మనబడి నాడు–నేడు పనులు జరగడంతో పోలింగ్ బూత్‌లలో మార్పులు చేయనున్నట్లు వెల్లడించారు. వేమూరు మండలంలోని పెనుమర్రు, చదలవాడ, కుచ్చెళ్లపాడు, కొల్లూరు మండలంలో చినపులివర్రు, తిప్పల కట్ట, జువ్వల పాలెం, పెసర్లంక, పెదలంక, అమర్తలూరు మండలంలో యడవూరు, చుండూరు మండలంలో మండూరు, పాఠశాలల్లో బూత్‌లు మారనున్నట్లు వివరించారు. భట్టిప్రోలు మండలంలోని భట్టిప్రోలు, ఐలవరం గ్రామంలో కొన్ని పేర్లు తప్పులు పడటంతో వాటిని కూడా విచారించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లిముంత ఏడుకొండలు, గాదె శివరామ కృష్ణారెడ్డి, దొప్పల పూడి జ్యోతిబాబు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన బాల్యంతో బంగారు భవిష్యత్తు


విద్యార్థులతో మాట్లాడుతున్న మోజెష్

బాపట్ల అర్బన్: ఆరోగ్యవంతమైన బాల్యం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని ఏఎంఓ బిళ్ల మోజెష్ అన్నారు. డెటాల్ బనేగా స్వస్థ ఇండియా, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన హైజిన్ ఒలంపియాడ్ ప్రశ్నపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం వెదుళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదు మండలాల్లోని ఎంపిక చేయబడిన 99 పాఠశాలల్లో హైజిన్ ఎడ్యుకేషన్ అందజేయడం జరిగిందన్నారు. ఒలంపియాడ్ ఎగ్జామ్‌ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న క్రమంలో విద్యాశాఖ భాగస్వామ్యంతో బాపట్ల జిల్లాలో 4,950 మందికి ఈ పరీక్షను నిర్వహించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఐదు విభాగాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.50 వేలు, రూ. 30వేలు, రూ.20వేలు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లాలో విద్యార్థులు ఈ బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీబీఎస్ఐ బృందానికి అభినందనలు తెలిపారు. బాపట్ల ఎంఈఓ ఎస్. నిరంజన్ మాట్లాడుతూ మంచి అలవాట్ల ద్వారా చిన్నారులు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ పరీక్ష ద్వారా చేతుల పరిశుభ్రతకు సంబంధించిన అవగాహన ప్రాధాన్యత విద్యార్థులకు తెలుస్తుందని అభిప్రాయపడ్డారు. హెచ్ఎం విజయ్ కుమార్, డీబీఎస్ఐ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ కుమారి, డిస్ట్రిక్ట్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వీబీ దాస్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఓలేరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

భట్టిప్రోలు (కొల్లూరు) : భట్టిప్రోలు మండలంలోని ఓలేరులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున సాయంత్రం 4 గంటల నుంచి ఇంటింటికి పర్యటించి, సంక్షేమ పథకాల లబ్ధిని వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

బీమా నగదు అందజేత

రేపల్లె రూరల్: పేటేరు గ్రామానికి చెందిన డొక్కు పాండురంగారావు అనే వ్యక్తి మృతి చెందడంతో.. వైఎస్సార్ భీమాలో భాగంగా మృతుని కుటుంబానికి రూ.10వేల నగదును మట్టి ఖర్చుల నిమిత్తం మంగళవారం పంచాయతీ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వార్డు మెంబర్లు ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రేపల్లె రూరల్: పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవటంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీవో మాణిక్యం అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా తుమ్మల పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. తక్కువ ఖర్చుతో పౌష్టికాహార తయారీని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి భానుకోటి, సూపర్‌వైజర్ నాంచారమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

డ్రెయినేజ్ పనుల పరిశీలన



భట్టిప్రోలు (కొల్లూరు) : డ్రెయినేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు భట్టిప్రోలు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం భట్టిప్రోలులోని బస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన డ్రెయినేజ్ పూడికతీత పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి బాలికల క్రీడా ఎంపికలు



పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని కేర్ ఇంగ్లీషు మీడియం హై స్కూలులో జరుగుతున్న స్కూల్ గేమ్స్ బాలికల విభాగంలో మంగళవారంతో ముగిశాయి. మండల స్థాయిలో అండర్–14, 17 విభాగంలో బాలికలు వివిధ క్రీడా పోటీల్లో తలపడ్డారు. కబడ్డీ, ఖోఖో, త్రో బాల్, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగ, అథ్లెటిక్స్‌లో ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థినులు బాపట్ల నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వ్యాయామోపాధ్యాయులు కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు కరిముల్లా, సోమరాజు, కేర్ పాఠశాల అకడమిక్ కో–ఆర్డినేటర్ బద్రి, వ్యాయామోపాధ్యాయులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

ట్రాక్టర్‌ను సీజ్‌చేసిన సెబ్ అధికారులు



బాపట్లటౌన్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఈబీ సీఐ ఎస్. శ్రీనివాసరావు హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం సీజ్ చేశారు. సీఐ ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని పాండురంగాపురం నుంచి విజయలక్ష్మి పురం వెళ్లే మార్గంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న.. సమాచారంతో మంగళవారం దాడులు నిర్వహించామన్నారు. చీరాల మండలం, గవినివారిపాలెం గ్రామానికి చెందిన పేర్లి పండును అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కోర్టుకు హాజరు పరిచామన్నారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు మృతి

తెనాలిరూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పొనుకుమాలి శివకుమార్, రాధ(63) దంపతులు నివసిస్తున్నారు. సోమవారం ఉదయం టీ పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని మరో వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యసేవలు


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

నగరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్యసురక్ష సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమంపై పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి పరిచి, కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 30 వరకు వైద్యసిబ్బంది గ్రామాలలో ఇంటింటికి పర్యటించి, సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ధూళిపూడి, చినమట్లపూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ భవానీశ్రీ,, తులసి, రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిల్‌తో వ్యక్తిపై దాడి

చుండూరు(వేమూరు): మద్యం మత్తులో ఎదురుపడిన వ్యక్తిపై ఇద్దరు మద్యం బాటిల్‌తో దాడి చేసిన ఘటనపై మంగళవారం కేసునమోదైంది. ఎస్ఐ నవీన్ వివరాల మేరకు.. చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామానికి చెందిన అట్లు చలంరెడ్డి గత ఆదివారం మద్యం సేవించేందుకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన గోపిరెడ్డి, సురేష్ అనే ఇద్దరు మద్యం సేవించి ఇంటికొస్తున్నారు. చలంరెడ్డి వారికి ఎదురుపడటంతో..మద్యం బాటిల్‌తో దాడి చేశారు. చేతికి తీవ్రగాయమైన చలంరెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేశామని, ఎస్ఐ నవీన్ తెలిపారు.

మహిళలకు న్యాయం చేయాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

రేపల్లె రూరల్: డ్వాక్ర మహిళల పేర్లతో అక్రమంగా రుణాలు పొందిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుని, వారికి న్యాయం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమాయకులైన మహిళల కొంత మంది బ్యాంకర్లతో లాలూచీపడి రుణాలు పొందారన్నారు. రుణాలు చెల్లించాలని నోటీసులు వచ్చే వరకు ఈ విషయం మహిళలకు తెలియకపోవడం విచారకరమన్నారు. ఈ అంశమై ఉన్నతాధికారులకు పిర్యాదు చేసినా ఫలితం లేదని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విడతలవారీగా నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కమిటీ కార్యదర్శి షేక్.ఆశా, అధ్యక్షురాలు షేక్.జహీదా, గౌరవాధ్యక్షురాలు ఆర్.నాగమణి, ఉపాధ్యక్షులు కె.నాంచారమ్మ, కోశాధికారి షబానా సుల్తానా, సీపీఎం నాయకులు ఆశీర్వాదం, రమేష్, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు గడువు పెంపు


వేమూరులో పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

వేమూరు: ఈ–క్రాప్ నమోదు గడువును ఈ నెల 30 వరకు ప్రభుత్వం పెంచిందని, నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి సునీత తెలిపారు. విత్తు నుంచి పంట కోత వరకు అన్ని సేవలను రైతుకు ఆర్బీకేలు అందిస్తున్నాయన్నారు. ఎరువుల రాయితీ, పురుగు మందులు, విత్తనాలు, ప్రభుత్వ పథకాల వర్తింపు, బీమా సౌకర్యానికి ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి అని ఏఓ సునీత రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో 18, 500 ఎకరాల్లో వరి సాగు చేపట్టారని, 11,500 ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు పూర్తయినట్లు వెల్లడించారు. ఇంకా పంట నమోదు చేసుకోని రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించాలని, ఈకేవైసీ కూడా చేయించుకోవాలని స్పష్టం చేశారు.

గుండెపోటుతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి


ఆంజనేయులు (ఫైల్)

కర్లపాలెం: తహసీల్దారు కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పి.ఆంజనేయులు(45) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. వివరాల మేరకు.. ఉదయం 9గంటలకు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లిన ఆంజనేయులు గుండె దడగా ఉందని, టాబ్లెట్ వేసుకుని వస్తానని సిబ్బందికి చెప్పి తన ఇంటికి వెళ్లాడు. పరిస్థితి విషమించటంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. వైద్యుడి సలహా మేరకు బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకుని వెళ్లారు. అప్పటికే అతను మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆంజనేయులుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తహసీల్దారు కేశవనారాయణరావు, కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొల్లూరు: ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను గుర్తించి, తగిన వైద్య సేవలు అందించేందుకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని కొల్లూరులోని కృష్ణంరాజు వైద్యశాల వైద్యులు కృష్ణంరాజు తెలిపారు. మంగళవారం కొల్లూరులోని వైద్యశాలలో గుంటూరు నటరాజ్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 600 మందికి వైద్య పరీక్షలు చేశారు. స్థానిక శ్రీసాయి వాసవి విద్యా సంస్థల విద్యార్థులకు నేత్ర, దంత పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. వైద్యులు పి. నటరాజ్, ఎస్కే వలి, టి.ప్రవీణ్, టి.రామారావు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయివాసవి విద్యా సంస్థల డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కొల్లూరు : చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం తక్షణమే పాలక మండలి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం భట్టిప్రోలులోని తహసీల్దారు డి.వెంకటేశ్వరరావుకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. చేనేత ఎన్నికల నిర్వహణలో జాప్యం కారణంగా తలెత్తుతున్న ఇబ్బందులను వెల్లడించారు. చేనేత సహకార సంఘాలకు ఏర్పాటు చేసిన నామినేటెడ్ బోర్డుల సమయం గత జులై 7న ముగియడంతో చేనేత కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విన్నవించారు. సహకార సంఘాలకు ప్రత్యేకాధికారి, పాలక మండలి బోర్డులు లేని కారణంగా కార్యకలాపాలు కుంటుపడుతున్నాయని వివరించారు. చేనేత కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాలక మండలి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దారు సమస్యను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత కార్మిక సంఘాల నాయకులు గొట్టుముక్కల బాలాజీ, మెరుగుడు సత్యనారాయణ, దీపాల సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, దొంతు కోటేశ్వరరావు, కె. మోహన్‌రావు, ఆకురాతి శ్రీనివాసరావు, కె.పార్థసారథి, రామారావు, బి. శంకరరావు పాల్గొన్నారు.

మూడో రోజు ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు


నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వేమూరు: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్ట బద్ధత కల్పించాలని నియోజకవవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యల్లమాటి దాసు కోరారు. వేమూరు బస్టాండ్ సెంటరులో ఎమ్మార్పీఎస్ రిలే నిరహార దీక్షలు మంగళవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ నెల 18 నుంచి 22 వరకు జరుగునున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి, చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు తోడేటి సాగర్, వరహాపురం ఉప సర్పంచ్ యల్లవర్తి సాంబశివరావు, బీసీ నాయకులు మురాల వాసు దేవ, ఎలిచర్ల కిరణ్ బాబు తదితరు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

డీఎస్పీ జనార్ధనరావు


మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐలు

తెనాలిరూరల్: చవితి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత పోలీసు స్టేషన్ల నుండి అనుమతులు పొందాలని డీఎస్పీ బి.జనార్ధనరావు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మట్లాడారు. ఈ నెల 18వ తేదీన వినాయక చవితి సందర్భంగా మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండపాలు ఏర్పాటు చేసే వారు ముందుగా ఒక కమిటీగా ఏర్పడాలని, ఐదుగురు సభ్యుల గుర్తింపు కార్డులను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగే తప్పనిసరిగా తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో వివరాలు సమర్పించి అనుమతులు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, ఫైర్ విభాగాల వారి వద్దా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేయడం, డీజే బాక్సులు పెట్టడం వంటివి చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ సభ్యులు నిరంతరం మండపాల వద్ద ఉండేలా చూసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు రూట్ మ్యాపును ముందుగా పోలీసులకు తెలపాలని మండపాల వద్ద, నిమజ్జనం రోజున ఊరేగింపు సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ సూచించారు. సమావేశంలో సీఐలు కె. శ్రీనివాసరెడ్డి, కె. చంద్రశేఖర్, ఎస్. వెంకట్రావు ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

గ్రామదర్శిని కార్యక్రమంలో సీఐ జి. వేణుగోపాలరెడ్డి


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ వేణుగోపాలరెడ్డి

బాపట్లటౌన్: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డి హెచ్చరించారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనకాద్రినగర్ ప్రజలకు చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రతిరోజు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా వ్యవసాయ కూలీలను ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఎక్కించుకుని, లౌడ్ స్పీకర్లు పెట్టి మితిమీరిన శబ్దంతో ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే బాపట్ల – సూర్యలంక రోడ్డులో కనకాద్రినగర్, ముత్తాయపాలెం సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన డివైడర్లకు ఇరువైపులా కూర్చొని కాలయాపన చేస్తున్నారని, దీంతో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, వారిని దుర్భాషలాడే వారిపై అధికంగా కేసులు నమోదవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కనకాద్రినగర్ ప్రజలు పాల్గొన్నారు.

జగనన్న పింఛను కానుక పంపిణీ


పింఛన్ కార్డు అందజేస్తున్న మునిసిపల్ వైస్ చైర్మన్ కాశీవిశ్వనాథగుప్త

రేపల్లె రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు మునిసిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛను కానుకను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నూతనంగా 340 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే పట్టణంలో 4,418 మంది పింఛనుదారులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నెలకు రూ.1,22,76,500ల నగదును అందిస్తోందన్నారు. కుల మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. ఆయా వార్డుల్లో లబ్ధిదారులకు స్థానిక కౌన్సిలర్లు, గృహ సారథులు, వార్డు ఇన్‌చార్జి ద్వారా నగదు అందజేశారు.

నాడు–నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి


మాట్లాడుతున్న సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: నాడు–నేడు రెండవ విడత పనులు త్వరగా పూర్తి చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ కో–ఆర్డినేటర్ ఎం.విజయలక్ష్మి ఆదేశించారు. తెనాలి, కొల్లిపర మండలాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో అదనపు తరగతి గదులు, ఇతర మౌలిక వసతుల కల్పన నాడు–నేడు ద్వారా చేస్తున్నట్లు చెప్పారు. పూర్తి అయిన పనులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడంతో పాటు వాటి వివరాలను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో జరిగే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే జిల్లా అధికారులను సంప్రదించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ ఎమినిటీస్ సిబ్బంది సమన్వయంతో పనులు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో తెనాలి, కొల్లిపర మండల విద్యాధికారులు ఎం.లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు, జి.సల్మాన్ రాజు, కె.జాన్సీలత, మున్సిపల్ డీఈ నాగభూషణం, ఏఈలు రాజఫణీంద్ర, ఆంజనేయరాజు, చైతన్య సిబ్బంది పాల్గొన్నారు.

12 ఆటోలు.. రూ.65 వేలు

ఆటోల తనిఖీకి ప్రత్యేక డ్రైవ్

తెనాలిరూరల్: ప్రయాణికులను తరలించే ఆటోలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. తెనాలి పట్టణం, వడ్లమూడి, నారాకోడేరు వద్ద ఆటోలను ప్రాంతీయ రవాణా అధికారి ప్రసాద్, మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, సహాయ మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు తమ సిబ్బందితో కలసి మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న పలు ఆటోలను గుర్తించి అపరాధ రుసుం విధించారు. 12 వాహనాలకు కలిపి రూ. 65 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆర్టీవో ప్రసాద్ మాట్లాడుతూ 12 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులను కేవలం ఆరుగురిని మాత్రమే ఆటోలో ఎక్కించుకోవాలని డ్రైవర్ పక్కన వెనుక డోర్‌తెరచి విద్యార్థులను/ప్రయాణికులను ఎక్కించుకోకూడదని డ్రైవర్లకు సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్లు పెట్టడం, డ్రైవర్ పక్కన కూర్చునే విధంగా ఏర్పాట్లు చేసిన ఆటోలను అవసరమైతే సీజ్ చేస్తామన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన


పూజా కార్యక్రమంలో భక్తులు

పిట్టలవానిపాలెం : చందోలు గ్రామంలో వేంచేసిన బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని యువతులకు శ్రీఘ్రముగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.